క్లుప్తంగా

పేద విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం



కాకుర్తి పవన్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ బి బ్లాక్‌కు చెందిన కాకుర్తి మురళి కుమారుడు పవన్‌కు శుక్రవారం రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. స్థానిక చైతన్య కళాశాలలో పవన్ ఇంటర్ చదువుతున్నాడు. వారి ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న నాగేశ్వర్ తన కార్యాలయంలో ఈ సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కాకరపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు వసూలును నియంత్రించాలి

సీటీఆర్ఐ: గ్యాస్ సిలిండర్‌ను ఇంటికి తీసుకు వచ్చినందుకు రూ.40 అదనంగా వసూలు చేస్తున్నారని, దాన్ని నియంత్రించాలని బీజేపీ 8వ మండల అధ్యక్షుడు నందివాడ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం 41వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సిలిండర్‌కు డెలివరీ చార్జీలు అంటూ రూ.40 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేయడం దారుణమన్నారు. సిలిండర్ ధరలోనే ఈ చార్జీలు ఉంటాయన్నారు. ప్రస్తుత సిలిండర్ ధర రూ.830 మాత్రమేనని, దానికి అదనంగా ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం వినియోగదారులకు లేదన్నారు.



రాష్ట్ర స్థాయి ఉషూ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)

క్రీడా మహేంద్రి

- క్రీడా పోటీలకు వేదికగా రాజమహేంద్రవరం
- తరచూ పలు పోటీల నిర్వహణ
- సత్తా చాటుతున్న నగర విద్యార్థులు

ప్రకాశం నగర్: సాంస్కృతిక రాజధానిగా పేరు పొందిన రాజమహేంద్రవరం ఇప్పుడు క్రీడలకు కేంద్రంగానూ మారుతోంది. నగరంలో తరచూ పలు రాష్ట్ర స్థాయి ప్రధాన క్రీడా పోటీలు నిర్వహించడమే దీనికి నిదర్శనం. వీటితో పాటు ఇక్కడి పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఆయా పోటీల్లో ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అవుతున్నారు. ఇటీవల స్థానిక చెరుకూరి కన్వెన్షన్ హాల్లో ఏపీ స్టేట్ వుమెన్స్ ఉషూ లీగ్ క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రెండు రోజుల పాటు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పోటీలను నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తిలకించి విజేతలను అభినందించారు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన విజేతలు జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు.



ఉషూ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థినులు (ఫైల్)

పతకాల కైవసం

కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఏపీ స్టేట్ వుమెన్స్ ఉషూ లీగ్ క్రీడా పోటీల్లో సత్తా చాటి మూడు పతకాలను కైవసం చేసుకున్నారు. 60 కేజీల విభాగంలో కె.రేఖా బంగారు పతకం, 52 కేజీల విభాగంలో కె.సత్యవేణి వెండి పతకం, 70 కేజీల విభాగంలో ఎం.ధనలక్ష్మి కాంస్య పతకాలను సాధించారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి ప్రత్యేకంగా అభినందించారు.

వసతుల కొరత

నగరంలోని ఆర్ట్స్ కళాశాల, స్టేడియం, ఎస్‌కేవీటీ, లాలాచెరువు పోలీస్ గ్రౌండ్స్ వంటి క్రీడా మైదానాలు ఉన్నప్పటికీ వాటిలో వసతులు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయని క్రీడా విశ్లేషకులు అంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్కూల్ గేమ్స్ ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలను నిర్వహించి గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి వారికి మెరుగైన శిక్షణ ఇచ్చారు. ఆ చర్యలతో క్రీడాకారుల ప్రతిభకు పదును పెట్టినట్లు అయ్యింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో క్రీడాకారులు పలు క్రీడాల్లో రాణించి పతకాలు సాధిస్తున్నప్పటికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు అందడం లేదని వాపోతున్నారు.

మంచి ప్రతిభ



జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలతో పాటు జాతీయ క్రీడల్లోనూ నగరానికి చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి, పతకాలు సాధిస్తున్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఆయా క్రీడా శిక్షకులు, పీడీలు చేస్తున్న కృషి అభినందనీయం. క్రీడలతో శరీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది. వాటిలో రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది.

– డీఎంఎం శేషగిరి, జిల్లా చీఫ్ కోచ్

సంగీతంలో ప్రతి రాగానిదీ శ్రావ్యమైన శైలి



గోపీకృష్ణను సత్కరిస్తున్న సంజీవరావు తదితరులు

సీటీఆర్ఐ: భారతీయ శాస్త్రీయ సంగీతంలో ప్రతి రాగం ఒక శ్రావ్యమైన శైలిని పోలి ఉంటుందని బెంగళూరు అన్నమాచార్యగా పేరొందిన చీమలమర్రి గోపీకృష్ణ అన్నారు. కళాగౌతమి, సంహిత డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సంగీత చికిత్స (మ్యూజిక్ థెరపీ) అనే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అధ్యక్షత వహించిన కళ గౌతమి అధ్యక్షుడు డాక్టర్ బీవీబీ సంజీవరావు మాట్లాడుతూ నిరాశ, ఆందోళన, శారీరక ఆరోగ్య సమస్యలకు సంగీతానికి మించిన చికిత్స లేదన్నారు. సంహిత కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థుల మానసిక స్థితిగతులు మెరుగుపరచడానికి సంగీత చికిత్స మెరుగైన మార్గంగా అభివర్ణించారు. సైకాలజిస్ట్ నాగిరెడ్డి, సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు సంగీతం గొప్పదనాన్ని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఏవో జి.బాలకృష్ణ, రామకృష్ణ, సీహెచ్ సీతారామనాయుడు పాల్గొన్నారు.

డీపీఆర్‌వో కాశయ్య సేవలు అభినందనీయం



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న జేసీ చిన్న రాముడు

సీటీఆర్ఐ: ప్రభుత్వానికి, సమాచార సాధనాలకు మధ్య వారధిగా డీపీఆర్‌వో ఐకా కాశయ్య అందించిన సేవలు అభినందనీయమని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి కొనియాడారు. కాశయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా సమాచార శాఖ సిబ్బంది శుక్రవారం స్థానిక ఆనం కళాకేంద్రంలోని సర్వారాయ కళామందిరంలో అభినందన వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు హాజరై, కాశయ్య సేవలను కొనియాడారు. జిల్లా యంత్రాంగానికి, పాత్రికేయ వర్గానికి వారధిగా విలువైన బాధ్యతలు నిర్వహించారన్నారు. ఆయన విశ్రాంత జీవితం ప్రశాంతంగా గడపాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కాశయ్య దంపతులను ఘనంగా సన్మానించి, జ్ఞాపిక, సన్మాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత డివిజనల్ పీఆర్వోలు అలీ, సాయిబాబా, అమలాపురం డివిజనల్ పీఆర్వో రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కాశయ్య దంపతులకు కలెక్టర్ పి.ప్రశాంతి తన క్యాంపు కార్యాలయంలో అభినందన తెలియచేస్తూ సన్మానించారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

సీటీఆర్ఐ: ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఈట్ స్ట్రీట్ వద్ద గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో రీచ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రీచ్ జిల్లా ప్రతినిధి జేవీజీఎన్ వర్మ మాట్లాడుతూ టీబీ రోగులకు కావాల్సిన పౌష్టికాహార కిట్లను హిందూస్థాన్ యూనిలీవర్ ఆర్థిక సాయంతో అందజేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ అనుహ్య, టీబీ సూపర్ వైజర్ సత్యనారాయణమూర్తి, అనసూరి వెంకట శ్రీనివాసరావు, అనిల్ పాల్గొన్నారు.

వ్యక్తిపై పీడీ యాక్ట్ అమలు

కంబాలచెరువు: ఆల్కాట్ గార్డెన్స్‌కు చెందిన యర్రా గణేష్‌పై ఎస్పీ పీడీ యాక్ట్ అమలు చేశారు. ఆ వివరాలను రెండో పట్టణ పోలీసులు శుక్రవారం తెలిపారు. గణేష్ ప్రమాదకరమైన నేరస్తుడుగా ఉంటూ డెకోయిటీ, దోపిడీ, నార్కోటిక్ డ్రగ్స్ తో పాటు అనేక సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నాడు. అతను నివసించే ప్రదేశంలో ప్రజలను భయాభ్రాంతులకు గురిచేస్తున్నాడు. సుమారు 15 క్రిమినల్ కేసులలో నిందితుడిగా ఉన్నాడు. అతడికి పోలీసులు చాలాసార్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా ప్రవర్తన మారకపోవడంతో.. పీడీ యాక్ట్ అమలుకు కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

స్టిక్ మనోహర్‌కు పీసీ సర్కార్ అవార్డు



అవార్డు అందుకుంటున్న స్టిక్ మనోహర్

సీటీఆర్ఐ: నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది, మెజీషియన్ స్టిక్ మనోహర్‌కు పీసీ సర్కార్ సీనియర్ మెమోరియల్ ఎక్సలెన్సీ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తెలంగాణ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆర్కేస్ వండర్ వరల్డ్, తెలంగాణ మేజిక్ అకాడమీ ఆధ్వర్యంలో పీసీ సర్కార్ సీనియర్ మెమోరియల్ అవార్డుల వేడుక జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ హైకోర్టు జస్టిస్ సూరేపల్లి నంద చేతుల మీదుగా తనకు మనోహర్ అవార్డు అందుకున్నారు. ఆయనకు రాజమహేంద్రవరానికి చెందిన పలువురు న్యాయవాదులు, మెజీషియన్లు అభినందనలు తెలిపారు.

న్యాయం చేయాలంటూ ధర్నా

ధవళేశ్వరం: తమకు న్యాయం చేయలంటూ వీఆర్ పురం బీసీ కాలనీ వాసులు శుక్రవారం ధవళేశ్వరంలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము వడ్డిగూడెం పంచాయతీ పరిధిలోకి వస్తామన్నారు. పోలవరం ఇరిగేషన్ శాఖ వడ్డిగూడెం పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు నోటిఫికేషన్ ఇచ్చారని, కానీ వీఆర్ పురం బీసీ కాలనీలో ఉన్న తమ 209 కుటుంబాలను నోటిఫికేషన్‌లో చేర్చలేదన్నారు. తక్షణమే వీటికి కూడా నోటిఫికేషన్ ఇప్పించాలని కోరారు.

60 లీటర్ల సారా స్వాధీనం

ధవళేశ్వరం: స్థానిక మార్కెట్ ఏరియాలో 60 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ టి.గణేష్ తెలిపారు. అక్కడ బైక్‌పై సారా రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పి.సత్తిబాబు, ఆర్.దుర్గాప్రసాద్‌లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

కోడి పందేలపై దాడి

రాజమహేంద్రవరం రూరల్: దివాన్ చెరువులో కోడి పందేల శిబిరంపై శుక్రవారం బొమ్మూరు ఎస్సై ప్రియకుమార్, సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ సందర్భంగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.2800, తొమ్మిది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

నన్నయ వీసీ ప్రసన్నశ్రీకి సత్కారం



వీసీ ప్రసన్నశ్రీని సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

సీటీఆర్ఐ: ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ ప్రసన్న శ్రీని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ఫ్రెండ్స్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నక్కా సోమేశ్వరరావు, కుసుమ సాయిబాబా, జార్జ్ ఆంథోనీ, ఠాగూర్, ఈ.రాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచుతున్నామంటూ తగ్గిస్తున్నారు



ముత్యాల పోసికుమార్

ధవళేశ్వరం: దివ్యాంగుల పింఛన్లు పెంచుతున్నామంటూ తగ్గిస్తున్నారని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ విమర్శించారు. దివ్యాంగులకు పింఛన్లు పెంచామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సర్వే సాకుతో దివ్యాంగ పింఛన్లను కత్తిరించే ఎత్తుగడలను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలల గడుస్తున్నా ఒక కొత్త దివ్యాంగ పింఛన్ కూడా మంజూరు చేయలేదన్నారు. పైగా అనర్హత పేరుతో తొలగింపునకు శ్రీకారం చుట్టారని మండిపడ్డారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

కంబాలచెరువు: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, గమ్యస్థానాలను సురక్షితంగా చేరుకోవాలని ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ నూతన మోటారు వెహికల్ చట్టం శనివారం నుంచి అమల్లోకి వస్తోందన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రతి వాహనదారుడు భాగస్వాములు కావాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, తమ వాహనాల డాక్యుమెంట్లు దగ్గర పెట్టుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

'లేపాక్షి'లో డిస్కౌంట్ సేల్

సీటీఆర్ఐ: గోకవరం బస్టాండ్ సమీపంలోని లేపాక్షి ఎంపోరియంలో క్లియరెన్స్ సేల్స్‌లో భాగంగా ఎంపిక చేసిన వస్తువులపై 10 శాతం నుంచి 50 శాతం వరకూ డిస్కౌంట్ అందజేస్తున్నట్టు లేపాక్షి నగర శాఖ మేనేజర్ జి.మోనిక్ అన్నారు. ఏపీ హస్తకళలు అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆదేశాల ప్రకారం క్లియరెన్స్ సేల్స్ పెట్టడం జరిగిందన్నారు. ఈ అమ్మకాలు శనివారం నుంచి మార్చి 31 వరకూ జరుగుతాయన్నారు. లేపాక్షి ఎంపోరియంలో అన్ని రకాల హస్తకళా వస్తువులు, చేనేత వస్త్రాలు లభిస్తాయన్నారు.

మానవ జీవనానికి నీరు అత్యవసరం



యోగా సాధనలో పాల్గొన్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: మనిషి జీవనానికి అత్యవసరమైన నీటిని వృథా కాకుండా పరిరక్షించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనరు కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. కేంద్ర జలవనరుల శాఖ జలశక్తి విభాగం, నదీ జలాల పరిరక్షణ సంస్థ సూచనల మేరకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పుష్కర ఘాట్ వేదికగా శుక్రవారం వివిధ కార్యక్రమాలు చేపట్టారు. నగరపాలక సంస్థకు చెందిన పదమూడు 13 ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన పోటీలతో విజేతకు బహుమతులు అందజేశారు. పుష్కరఘాట్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పలు యోగా సంస్థల సభ్యులు, నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం పుష్కర్ ఘాట్‌లో ఏర్పాటు చేసిన బోట్ రేసును జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కమిషనరు పీవీ రామలింగేశ్వర్, డిప్యూటి కమిషనర్ ఎస్.వెంకటరమణ, మున్సిపల్ ఆరోగ్య అధికారి డా.ఎ.వినూత్న, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదర్షా అలీ, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్ అస్పర్, కమాండ్ కంట్రోల్ రూం హెడ్ రవితేజ పాల్గొన్నారు.

డివిజన్‌లో రూ.27.93 కోట్ల పన్ను వసూలు



జేగురుపాడులో మాట్లాడుతున్న డీఎల్‌పీవో నాగలత

కడియం: రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని గ్రామ పంచాయతీల నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.27.93 కోట్ల వరకూ పన్ను వసూలైందని డీఎల్‌పీవో ఎం.నాగలత తెలిపారు. మండలంలోని జేగురుపాడు, పొట్టిలంక పంచాయతీల్లో ఆమె శుక్రవారం పర్యటించి, పలు ఫిర్యాదులపై విచారణలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరం, కోరుకొండ, సీతానగరం, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, గోకవరం మండలాల పరిధిలోని 146 గ్రామ పంచాయతీల నుంచి 67.58 కోట్లు ఇంటి పన్నులు వసూలు కావాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 41 శాతం మేర వసూలైందన్నారు. మార్చి 15 నాటికి నూరుశాతం పన్ను వసూళ్ళు పూర్తవుతాయన్నారు. తడి, పొడి చెత్త సేకరణకు ముమ్మర చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎస్‌వీ రాంప్రసాద్, గ్రామ కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, అమీర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు రూ.10 వేల కోట్లు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మధు

ప్రకాశం నగర్: జిల్లా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం వెంటనే రూ.10 వేల కోట్లను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలన్నారు. కూటమి, ఎన్డీఏ నాయకులు విశాఖ ఉక్కు కర్మాగారం గేటు వద్దకు వచ్చి కార్మికులకు భరోసా కల్పించాలన్నారు. మార్చి 14న వామపక్ష పార్టీలతో కలిసి విశాఖ ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, జట్ల సంఘం కార్యదర్శి సప్ప రమణ పాల్గొన్నారు.

సమాజ అభ్యున్నతికి సైన్స్ దోహదం

- విద్యార్థులతో పలువురు వక్తలు
- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



లాలాచెరువు పాఠశాలలో ప్రదర్శించిన సైన్స్ నమూనాలు



కడియం హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనాలు



డైట్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు



కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాలలో కెమిస్ట్రీ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు



ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

కంబాలచెరువు: సమాజ అభ్యున్నతికి సైన్స్ దోహదపడుతుందని వక్తలు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆనంద్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో కార్యక్రమం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడు వై.హైడియ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్తు తరాలు మనుగడ సాగించగలుగుతాయన్నారు. అధ్యక్షుడు భీమయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్.రవిబాబు, సీనియర్ నాయకులు చెక్క. తాతారావు మాట్లాడారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్.రవికుమార్, జేవీవీ నాయకులు శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

- లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సుమారు వంద మంది విద్యార్థులు సైన్సు ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు అంకం మల్లేశ్వరరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.రమేష్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు
- ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించాలని నాగరాజా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణి అన్నారు. ఆ పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పుష్పమాలతో నివాళులర్పించారు.
- ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం సుబ్రహ్మణ్యం పూల మాలవేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు.
- మోరంపూడి శ్రీచైతన్య టెక్నో స్కూల్లో ఏఎస్‌సీ ఎస్‌వీఎం మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను బయటకు తీసేందుకు సైన్స్ ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. ఆర్ఐ ఉదయ్ శంకర్, ఏజీఎం సురేష్, ప్రిన్సిపల్ లక్ష్మీసౌజన్య పాల్గొన్నారు.
- ఆర్ట్స్ కళాశాలలో సీవీ రామన్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు చీఫ్ సైంటిస్ట్, విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ కె.చంద్రశేఖర నాయుడు, ప్రిన్సిపల్ రామచంద్ర ఆర్కే మాట్లాడారు.

కొత్త ఆవిష్కరణలు చేయాలి

కడియం: విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేయాలని, శాస్త్రవేత్తలుగా తయారు కావాలని కడియం హైస్కూలు ఇన్‌చార్జి హెచ్ఎం షేక్ రఫీయుద్దీన్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పాఠశాలలో ప్రారంభించారు. స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, సైన్స్ ఉపాధ్యాయుడు సతీష్ ప్రసంగించారు.

అన్ని రంగాల్లో రాణించాలి

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సైన్స్ విశ్రాంత లెక్చరర్, ఎస్‌సీఈఆర్‌టీ అవార్డు గ్రహీత డాక్టర్ వాడ్రేవు సుగుణ అన్నారు. జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణాసంస్థ(డైట్)లో ప్రిన్సిపాల్ డా.ఏఎం జయశ్రీ ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్‌డే నిర్వహించారు.

స్కూల్ టు ల్యాబ్

సీటీఆర్ఐ: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'స్కూల్ టు ల్యాబ్', వైద్య శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రాఘవ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. నెహ్రూ నగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు కళాశాలలోని ప్రయోగశాలలపై అవగాహన కల్పించారు. కళాశాల యూత్ రెడ్ క్రాస్, గంగా ఎమర్జెన్సీ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.